పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు
- పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాల వర్తింపు
- కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం


ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం

దేవనకొండ: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. పార్టీలు, కులమతాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. మండలంలోని పి.కోటకొండ సచివాలయం-2 పరిధిలో శనివారం మంత్రి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఆలూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణస్వామి, మాలమల్లేశ్వర కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మంత్రి ఆయా కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. బుక్‌లెట్‌లోని వివరాల మేరకు లబ్ధి చేకూరిందా.. లేదా అని ఆయా కుటుంబాల సభ్యులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రతిఒక్కరూ సంక్షేమ పథకాలు వర్తించాయని మంత్రితో సంతోషంగా చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పల్లెల అభివృద్ధికి సీఎం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని గుర్తు చేశారు. పి.కోటకొండ గ్రామానికి సంబంధించి ప్రజలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.34.10 కోట్లు లబ్ధి పొందారని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పాలకవర్గాలు ఆలూరు నియోజకవర్గంలో ఇరువర్గాల మధ్య చిచ్చుపెట్టి ప్రజల జీవితాలతో ఆడుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టులు, పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరిగుతూ చాలా మంది దుర్భర జీవితాలు గడిపారని, తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి శాంతిమార్గం చూపించానని గుర్తు చేశారు. ఏదైనా సమస్య తలెత్తినా అక్కడికక్కడే పరిష్కరించి ఇరువర్గాలను రాజీ చేయించి ప్రశాంతంగా జీవనం సాగించేందుకు తనవంతు తోడ్పాటు అందించానన్నారు. పిల్లాతల్లులు అందరూ కలిసి సంతోషంగా వ్యవసాయం చేసుకుంటూ రాత్రిపూట ప్రశాంతంగా గడిపే జీవితం ఇచ్చినటువంటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వాదించాలని మంత్రి ప్రజలను కోరారు. నాకు ఎంతో అనుభవం అంటూ చెప్పుకోవడం తప్పా చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఇక సినీ హీరో పవన్‌కళ్యాణ్ రెచ్చగొట్టే ప్రసంగాలు తప్పా అతనికి ఏమీ తెలయదని విమర్శించారు. మాయమాటలతో మభ్యపెట్టేందు వస్తున్న బాబు, పవన్ మాటలను నమ్మొద్దన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని మంత్రి కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున, జెడ్పీటీసీ రామకృష్ణ, సర్పంచ్ బండమీద తిమ్మక్క, నాయకులు మీనుగకృష్ణ, రామనాయుడు, రామచంద్ర, రంగస్వామి, హనుమంతరెడ్డి, లక్ష్మన్నస్వామి, నిజాల్‌రెడ్డి, దివాకర్‌నాయుడు, ఉముంబా, అరుణ్‌కుమార్, రాజారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అవ్వా... బాగున్నావా !


నేలపై కూర్చుని వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పి.కోటకొండలో విస్తృతంగా పర్యటించిన మంత్రి గుమ్మనూరు జయరాం బీసీ కాలనీలో వృద్ధురాలు ఎల్లమ్మను పలుకరించారు. నిలువలేని ఆ వృద్ధురాలు నేలపై దొక్కుంటూ వెళ్తుండగా మంత్రి ఆప్యాయంగా పలుకరించారు. ఆమెతోపాటు నేలపై కూర్చుని కొద్దిసేపు ముచ్చటించారు. అవ్వా బాగున్నావా... పింఛన్ అందుతుందా... వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి పింఛన్ సొమ్ము ఇస్తున్నారా అని మంత్రి ఆరా తీశారు. దీంతో వృద్ధురాలు చాలా బాగన్నా నాయనా... పింఛన్ నెల నెలా అందుతుంది. ఏమి తిప్పలు పడకుండా వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి అందజేస్తున్నాడు అని సమాధానం ఇచ్చారు. ఓటు ఎవరికి వేస్తావని మంత్రి అడగ్గా... ఇంకెవరికి జగన్‌బాబుకు వేస్తానంటూ వృద్ధురాలు గట్టిగా చెప్పారు. అదేవిధంగా ఆరోగ్య శ్రీ ద్వారా అపెండిక్స్‌కు చికిత్స చేయించుకున్న రంగస్వామి, లక్ష్మిదేవి దంపతుల కుమారుడు రవికిరణ్ మంత్రి పరామర్శించారు.

కిడ్నీ మార్పిడికి సీఎం తక్షణ సాయం


విద్యార్థి తండ్రికి సీఎం తక్షణ సాయం రూ.8లక్షల మంజూరు పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీదేవి

కృష్ణగిరి: ఆగవేలి గ్రామానికి చెందిన తెలుగు లక్ష్మన్న కుమారుడు వీర ప్రకాశ్ పదోతరగతి చదువుతున్నాడు. ఇటీవల ఈ విద్యార్థికి తీవ్ర జ్వరం వచ్చింది. పరీక్షించిన కర్నూలు వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని, హైదరాబాద్ యశోద ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడి డాక్టర్లు కిడ్నీ ఫెయిల్ అయిందని తేల్చారు. ఆపరేషన్ చేసి మార్చాలంటే రూ.11లక్షలు అవసరమని చెప్పారు. అంత ఖర్చు భరించే పరిస్థితిలో లక్ష్మన్న లేరు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విజయవాడకు వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓఎస్‌డీ ధనుంజయరెడ్డి ద్వారా సమస్య వివరించారు. స్పందించిన సీఎం కిడ్నీ మార్పిడి చికిత్సకు తక్షణ సాయంగా రూ. 8 లక్షలు మంజూరు చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాన్ని శనివారం పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తన స్వగృహంలో విద్యార్థి తండ్రి తెలుగు లక్ష్మన్నకు అందించారు. తమకు చేసిన సహాయం జీవితాంతం మరువలేమని ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు సీఎం, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

రాజ్యాంగంపై అవగాహన అవసరం


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్.రామచంద్రారెడ్డి

పత్తికొండ రూరల్ : భారత రాజ్యాంగంపై ప్రతి విద్యార్థికి అవగాహన అవసరమని కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్‌చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం పత్తికొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కేపీఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు రామ్మోహన్ అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీరేశప్ప, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, రామ్మోహన్‌లు పాల్గొన్నారు.

చందోలి యువకుడికి డాక్టరేట్


గుడిసెల నాగేంద్రరెడ్డి

పత్తికొండటౌన్: పత్తికొండ మండలం చందోలి గ్రామానికి చెందిన రైతు దంపతులు గుడిసెల రామలింగమ్మ, గుడిసెల మారుతాత్మజ రెడ్డిల కుమారుడు గుడిసెల నాగేంద్రరెడ్డి కేఎల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ చదివిన నాగేంద్రరెడ్డి 'టోటల్ సింథసిస్ ఆఫ్ నాచురల్ ప్రొడక్ట్స్' అనే అంశంపై పరిశోధన చేశాడు. ఈ మేరకు శనివారం యూనివర్సిటీలో జరిగి కార్యక్రమంలో పీహెచ్‌డీ పట్టాను అందుకున్నాడు.

రేపు గౌరీనోముల పండుగ

ఆస్పరి: మండలంలోని జొహరాపురం గ్రామంలో సోమవారం గౌరీ నోముల పండుగ నిర్వహించునున్నట్లు గ్రామస్తులు తెలిపారు. లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం రథోత్సవం నిర్వహించునున్నట్లు చెప్పారు.

వైభవంగా కలశ ప్రతిష్ఠ

ఆలూరు: స్థానిక కోటవీధిలో కొలువైన శ్రీ సుంకలమ్మవ్వ దేవాలయ కలశ ప్రతిష్ఠాపన శనివారం పండితులు బెల్డోణ రామనాథశాస్త్రి, రవిశాస్త్రి ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. హోమం, గణపతిపూజ, పూర్ణహుతి, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరుశేఖర్, ఎంపీపీ రంగమ్మ, వైస్ ఎంపీపీలు శ్రీరాములు, నాగవేణి తదితరులు ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించుకున్నారు.

అఖిల భారత కిసాన్ సభను జయప్రదం చేయాలి

గోనెగండ్ల: డిసెంబర్ 15, 16, 17 తేదీల్లో కర్నూలులో జరిగే అఖిల భారత కిసాన్ సభ జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్ బాబు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని చిన్నమరివీడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణ, వీరేష్, పరమేష్, వెంకటేష్, గోవింద్, శాంతన్న తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ హింస రహిత సమాజానికి కృషి

తుగ్గలి: స్త్రీ హింస రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని ఎంపీడీఓ సావిత్రి, ఎస్ఐ మల్లికార్జున పిలుపునిచ్చారు. శనివారం స్థానిక స్త్రీ శక్తి భవన్‌లో అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినం నిర్వహించారు.

హాలహర్వి: సమాజంలో మహిళలపై హింసను అరికడదామని తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ఏపీఎం శివయ్య అన్నారు. శనివారం స్త్రీ శక్తి భవనంలో లింగ వివక్ష వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): మహిళలు చైతన్యవంతులు కావాలని ఏపీఎం చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వైకేపీ కార్యాలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. సీసీలు కోటేశ్వరమ్మ, చాముండేశ్వరి, శివన్న, పుల్లన్న పాల్గొన్నారు.

జగనన్నతోనే జనరంజక పాలన


ఎస్‌హెచ్ ఎర్రగుడిలో లబ్ధిదారుడికి బ్రోచర్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కృష్ణగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే జనరంజక పాలన సాధ్యమని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామంలో శనివారం పార్టీ నాయకులతో కలిసి 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ మేనిఫెస్టో అమలుపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి బ్రోచర్లను అందజేశారు. ప్రతి కుటుంబంలో ఏ పథకం ద్వారా ఎంత లబ్ధిపొందారో ప్రజల ద్వారానే చెప్పించారు. దేశ చరిత్రలో ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని కొనియాడారు. సచివాలయ పరిధిలో రూ.22 కోట్లను అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు, రాజశేఖరరెడ్డి, సర్పంచ్ గిరిబాబు, అనంతరెడ్డి, నారాయణరెడ్డి, రాఘవేంద్ర, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కలలను సాకారం చేయడమే ధ్యేయం

- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి
- టి.గోకులపాడు సమీపంలో హంద్రీ నదిపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు
- హామీ నెరవేర్చిన సీఎం జగనన్న


బ్రిడ్జి నిర్మించే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, అధికారులు

కృష్ణగిరి: ప్రజల కలలను సాకారం చేయడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి తెలిపారు. మండల పరిధిలోని టి.గోకులపాడు గ్రామ సమీపంలో హంద్రీ నదిపై ఏర్పాటు చేయనున్న బ్రిడ్జి స్థలాన్ని శనివారం ఆమె పంచాయతీరాజ్ జిల్లా ఎస్‌ఈ సుబ్రహ్మణ్యం, పీఐయూ డీఈ రమేష్‌కుమార్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఈ గ్రామస్తులు హంద్రీనదిలో పంట ఉత్పత్తులు తీసుకురావడం, ఇతర గ్రామాలకు వెళ్లాలంటే పడుతున్న కష్టాలను కళ్లారా చూశానన్నారు.

గత పాలకులకు ఓటు బ్యాంకుగా ..

గత పాలకులు బ్రిడ్జి సమస్యను కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే వాడుకోవడం జరిగిందన్నారు. ఈ సమస్యను ఎలాగైనా పరిష్కారించాలనే సంకల్పంతో ఈఏడాది మే నెలలో పత్తికొండకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా పెట్టుబడి సాయా న్ని అందించేందుకు వచ్చిన సమయంలో ఆయన దృష్టికి తీసుకెళ్లామన్నాని చెప్పారు. సీఎం జగనన్న వెంటనే స్పందించి సభలో ఈ బ్రిడ్జితోపాటు కంబాలపాడు-కోయిలకొండ గ్రామాల మధ్య, బొందిమడుగుల-మారెళ్ల గ్రామాల మధ్య బ్రిడ్జీల ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు.

రూ.13.30కోట్లు మంజూరు

ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రిడ్జీల నిర్మాణానికి రూ.13.30కోట్లు మంజూరు చేస్తూ పాలనా అనుమతులు ఇచ్చారని తెలిపారు. టి.గోకులపాడు గ్రామ సమీపంలో బ్రిడ్జీతో పాటు రామకృష్ణాపురం వరకు నాలుగు కిలోమీటర్ల రహదారిని రూ.7.95 కోట్లతో త్వరలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ బ్రిడ్జీని హంద్రీలో వంద మీటర్ల పొడవు, 7.5 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్నట్లు ఎస్‌ఈ సుబ్రమణ్యం తెలిపారు. వీరికి వెంట ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, తెలుగు మల్లయ్య, పురుషోత్తంరెడ్డి, నాగరాజు, సుధాకర్‌రెడ్డి, పూల రాజు, మిన్నెల్ల, తిమ్మరాజు, అల్లీసాహెబ్, గ్రామ రైతులు ఉన్నారు.

గొర్రెల వ్యాపారిపై సెబ్ హెడ్ కానిస్టేబుల్ దాడి

హొళగుంద: ఆంధ్ర-కర్ణాటక సరిహద్దు మార్లమడికి సమీపంలో వేదావతి(హగరి) నది వద్ద సెబ్ చెక్ పోస్టులో విధులు నిర్వహిస్తున్న సెబ్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు మామూళ్లు ఇవ్వలేదని గొర్రెల వ్యాపారిపై దాడి చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. బాధితుడు ఎల్లార్తి నసిరుద్దీన్, హొళగుంద పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. ఎల్లార్తి దర్గా వద్ద మటన్ వ్యాపారం చేసుకుంటున్న నసీరుద్దీన్ శనివారం కర్ణాటక రాష్ట్ర, బళ్లారి జిల్లా శిరిగేరి క్రాస్‌లో జరుగుతున్న సంతలో 60 గొర్రెలు, మేకలు కొని టెంపోలో తీసుకొస్తుండగా సెబ్ చెక్‌పోస్ట్ వద్ద హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు అడ్డగించి మామూళ్లు అడిగాడు. నసీరుద్దీన్ రూ.200 ఇవ్వడానికి వెళ్తే తీసుకోకుండా రూ.వెయ్యి కావాలని డిమాండ్ చేయడంతో ఇవ్వలేదు. దీంతో హెడ్ కానిస్టేబుల్ బూతులు తిడుతూ రెచ్చిపోయి తనపై దాడి చేసినట్లు బాధితుడు ఆరోపించాడు. దాడిలో కాలికి గాయం కావడంతో హొళగుంద పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై ఎస్ఐ శ్రీనివాసులును, సెబ్ సీఐ వెంకట్‌ను సంప్రదించగా.. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు హెడ్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వలసల నివారణకు కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ

నందవరం : అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో వలసల నివారణకు కృషి చేయాలని ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ, ఎంపీడీఓ దశరథ రామయ్య సూచించారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో వలసల నివారణ కోసం జాబ్ కార్డు ఉన్న వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామన్నారు. నందవరం మండలాన్ని ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించినందున 150 రోజులు పని కల్పించుకోవచ్చని చెప్పారు. అలాగే ప్రభుత్వం యువతీ యువకులకు 'ఉన్నతి' కార్యక్రమం ద్వారా ఆసక్తి ఉన్న రంగాల్లో స్కిల్ డైవలప్‌మెంట్ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తుందని తెలిపారు. ఎలక్ట్రికల్, మోటార్ మెకానిక్, మొబైల్, కుట్టుమిషన్, ఎంబ్రాయిడింగ్, బ్యూటీపార్లర్ తదిరత రంగాల్లో ఆసక్తి ఉన్న జాబ్ కార్డు కలిగిన యువతీ, యువకులు ఉచితంగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణలో రోజు వారి వేతనం కింద రూ.272 చెల్లిస్తారని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శివారెడ్డిగౌడ్, వైస్ ఎంపీపీ మఠ్రి ఆగ్నేశమ్మ, తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో నీటి సౌకర్యం


ట్యాంకు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి

మద్దికెర: జగనన్న కాలనీల్లో నీటి సౌకర్యం కల్పించేందకు ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మిస్తున్నామని జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని పెరవలి గ్రామంలోని జగనన్న కాలనీలో రూ.30 లక్షలతో చేపట్టిన ట్యాంకు నిర్మాణాన్ని పరిశీలించారు. ఇళ్లు లేని వారుండరాదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదలకు ఇంటి పట్టాలతో పాటు ఇంటి నిర్మాణానికి దశల వారీగా బిల్లులు మంజూరు చేస్తున్నారన్నారు. అంతేగాక మౌలిక వసతులు కూడా కల్పించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే కాలనీలో రూ.60 లక్షలతో ట్యాంకు నిర్మాణంతో పాటు పైపులైను వేసి ఇంటింటికీ కొళాయి వేయడం జరుగుతుందన్నారు. మండల కన్వీనర్ గంపల వెంకటేశులు, తాలూరి వెంకటేశ్వరరెడ్డి, మంజునాథ్‌రెడ్డి ఉన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

ఎమ్మిగనూరుటౌన్: సరైన వర్షాలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరం కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజశేఖర్ కోరారు. డిసెంబర్ నెలలో జరగనున్న జాతీయ కౌన్సిల్ సమావేశాలపై స్థానిక పద్మశాలి కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. సమావేశంలో ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, రైతు సంఘ నాయకులు రాజు, సత్యన్న, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

30న మున్సిపల్ సమావేశం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో ఈనెల 30వ తేదీన ఉదయం 11గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు శనివారం తెలిపారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

కదమకుంట్లలో పారిశుధ్య పనులు

తుగ్గలి : మండల పరిధిలోని కదమకుంట్లలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ మస్తాన్‌బీ గౌరవ సలహాదారు సుల్తాన్ డ్రైనేజీల్లో పేరుకు పోయిన చెత్తచెదారం, మట్టిని జేసీబీతో తీసివేయించారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి

మద్దికెర : బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఎంపీడీఓ నరసింహమూర్తి, తహసీల్దార్ నాగభూషణం, ప్రభుత్వ వైద్యులు శ్రీలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక వైకేపీ కార్యాలయంలో లింగ వివక్ష వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి, వైకేపీ ఏపీఎం మధుబాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా పాల్గొన్నారు.

అవి-ఇవి

ఎక్కువ ఓట్లు వుంటే విచారణ చేయండి

మద్దికెర : ఒకే ఇంట్లో 10 ఓట్ల కంటే ఎక్కువ ఉంటే బీఎల్‌ఓలు సమగ్ర విచారణ చేయాలని తహసీల్దార్ నాగభూషణం అన్నారు. శనివారం స్థానిక తన కార్యాలయంలో బీఎల్‌ఓలు, వీఆర్వోల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కువ ఓట్లు పోలింగ్ కేంద్రాలు గుర్తించడం జరిగిందన్నారు. 28, 35, 37, 37, 39, 44 పోలింగ్ కేంద్రాలలో పది కన్నా ఎక్కువగా వున్నాయని, వెంటనే అధికారులు విచారణ చేసి బోగస్ ఓట్లు తొలగించాలని సూచించారు.

భవన నిర్మాణాలు వేగవంతం చేయండి

నందవరం : గ్రామాల్లో చేపట్టిన ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని ఏజెన్సీ సభ్యులకు పంచాయతీ రాజ్ ఏఈ జయన్న సూచించారు. శనివారం మండల పరిధిలోని నాగలదిన్నెలో గ్రామ సచివాలయం-2 గ్రౌండ్ ఫ్లోరింగ్ పనులను పరిశీలించారు.

5న ఆత్మీయ సమ్మేళనం

హొళగుంద: డిసెంబర్ 5న ఆలూరు సమీపంలోని ఆదోని రోడ్డులో బెళ్లగుండ ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో నిర్వహించే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని బీసీవై ఆలూరు తాలూకా నాయకులు మోహన్‌ప్రసాద్ కోరారు. శనివారం ఆయన హొళగుందతో పాటు ఆయా గ్రామాలలో కురువ సంఘం నాయకులు కాళికప్రసాద్, కోగిలతోట శేషప్ప, గాదిలింగ, సుధాకర్, ఎండీ హళ్లి రంగస్వామి, గూళ్యం లింగమల్లప్ప, హనుమంతరెడ్డి తదితరులతో కలిసి ఆత్మీయ సమ్మేళనకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

5న మండల సర్వసభ్య సమావేశం

తుగ్గలి : డిసెంబర్ 5వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అనుంరాజు ఆదెమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సావిత్రి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలన్నారు. అదే విధంగా అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో సమావేశానికి రావాలని సూచించారు.

ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సీహెచ్‌సీలోని సమస్యలు పరిష్కరించాలని, వైద్యులు రాత్రి వేళలో అందుబాటులో ఉండాలని కోరుతూ సీపీఐ, అనుబంధ సంఘాల ప్రతినిధులు శనివారం ధర్నా నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి టి కృష్ణ ఆధ్వర్యంలో ముందుగా సీహెచ్‌సీ ముందు, ఆపై తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తాగునీటి కొరత తీర్చాలని, ల్యాబ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శివరాముడుకు వినతిపత్రం సమర్పించారు.

డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

తుగ్గలి : ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఆటోలకు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. శనివారం పరిమితికి మించి స్కూల్ పిల్లలను ఎక్కించుకుని వెళుతున్న ఆటోలను పట్టుకొని రూ.30,050 జరిమానా విధించారు. ప్రమాదాల నివారణపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

కృష్ణగిరి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రీ సర్వే ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు లభిస్తున్నాయని తహసీల్దార్ రాజేశ్వరి తెలిపారు. మండల పరిధిలోని టి.గోకులపాడు గ్రామ సచివాలయం ఆవరణలో శనివారం ఆమె రైతులతో సమావేశం నిర్వహించారు. గ్రామంలో కొన్ని నెలలుగా రీ సర్వే పగడ్బందీగా చేపట్టి.. పూర్తి చేయడం జరిగిందన్నారు. గ్రామంలో ఉన్న 244 సర్వే నంబర్లకు గాను 1,232 మంది రైతులు సాగులో ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరందికీ ఒక్కో సర్వే నంబర్‌కు ఒక్కో ఎల్‌పీఎం నంబర్ వస్తుందన్నారు. వీటిల్లో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకవస్తే ఇరువురికి నోటీసులు ఇచ్చి పరిష్కరిస్తామని తెలియజేశారు. త్వరలో అందరికీ భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తామని చెప్పారు. రీ సర్వేకు సహకరించిన రైతులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ రామలక్ష్మి, మండల సర్వేయర్ వెంకటసుబ్బయ్య, వీఆర్వోలు నారాయణ, గిడ్డయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి


విద్యార్థినుల విద్యా సామర్థ్యాలు పరిశీలిస్తున్న ఏపీసీ వేణుగోపాల్

వెల్దుర్తి(కృష్ణగిరి): 10వ తరగతి విద్యార్థులకు వెంటనే 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక (యాక్షన్ ప్లాన్) అమలు చేసి రాబోవు ఫైనల్ పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వేణుగోపాల్ ఉపాధ్యాయినులను ఆదేశించారు. శనివారం ఆయన జీసీడీఓ సునీతతో కలిసి వెల్దుర్తి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. డిజిటల్ టెక్నాలజీ ద్వారా, ఐఎఫ్‌ఎల్ స్క్రీన్‌ల ద్వారా జరుగుతున్న బోధనను పరిశీలించారు. 9వ తరగతి విద్యార్థులకు అందించిన బైజూస్ ట్యాబ్స్ తనిఖీ చేశారు. విద్యార్థులను పరిజ్ఞాన్ని పరిశీలించారు. ఎస్ఓ షాకీరాబేగం, ఉపాధ్యాయినులు ఉన్నారు.

రిజిస్టర్ భూమిపై ఫిర్యాదు తగదు

తుగ్గలి : రిజిస్టర్ భూమిని కొందరు మిగులు భూమిగా చెబుతున్నారంటూ బొల్లవానిపల్లి రైతు రంగారెడ్డి వాపోయాడు. ఈ మేరకు ఆయన శనివారం తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రాముడికి తన డాక్యుమెంట్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. పగిడిరాయి రెవెన్యూ పరిధిలోని 442 సర్వే నంబరులో 1.18 ఎకరాల భూమి తమదేనని, డాక్యుమెంట్లును పరిశీలించాలని కోరారు. కొందరు మిగులు భూమి అని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడం తగదన్నారు. విచారణ చేసి న్యాయం చేయాలని రైతు రంగారెడ్డి కోరారు.

హక్కుల కోసం పోరుబాట

దేవనకొండ: డిసెంబర్ 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు దివ్యాంగుల హక్కుల కోసం పోరుబాట యాత్ర నిర్వహిస్తున్నట్లు వీహెచ్ పీఎస్ బి.సి.నాగరాజు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక క్రాంతి దివ్యాంగుల కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. ఆదోని డివిజన్‌లోని ఎమ్మిగనూరు, గొనెగండ్ల, కోడుమూరు మీదుగా 100 కి.మీ.నాలుగు రోజుల పాటు యాత్ర సాగుతుందన్నారు. కార్యక్రమంలో ధోని మహ్మద్, నాగరాజు, శ్రీనివాసులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మిరప పంట ధ్వంసం

హొళగుంద: మండల పరిధిలోని గజ్జహళ్లి గ్రామానికి చెందిన జంగం నాగరాజ్ అనే రైతు పొలంలో మిరప పంటను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రెండెకరాల్లో పంట సాగుచేయగా కాయలు కూడా బాగా కాసి త్వరలో కోతకు వచ్చే దశలో నాశనం చేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. కొన్ని మొక్కలను పెరికి అక్కడే పడాశారని వాపోయాడు.